ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 26 ఫిబ్రవరి 2025

మహాశివరాత్రికి జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. కొండాకోనల్లో కొలువైన పరమేశ్వరుడి దర్శనం కోసం భక్తులు మంగళవారం నుంచే పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు నీటిగుండాలలో స్నానాలాచరించి శివుడిని దర్శించుకోనున్నారు. రాత్రంతా జాగారం చేయనున్నారు. పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తుల శివనామస్మరణతో శైవక్షేత్రాలు మారుమోగుతున్నాయి.

శివోహం..


స్వామివారి మూలవిరాట్


శివరాత్రి సందర్భంగా పొలతలలో ఏర్పాటవుతున్న దుకాణాలు


లంకమలకు వెళ్లే ముఖద్వారం

లంకమల క్షేత్రంలో..

బద్వేలు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణానికి 30 కిలోమీటర్ల దూరంలో లంకమల అభయారణ్యంలోని పుణ్యక్షేత్రం ముస్తాబైంది. సీతాదేవి అన్వేషణలో భాగంగా శ్రీరాముడు లంకమలలో సంచరిస్తూ అక్కడ కొలువై ఉన్న పరమశివుని పూజించడంతో ముక్తి రామలింగేశ్వర క్షేత్రంగా పేరొచ్చిందని స్థానికుల కథనం. మహాశివరాత్రి పర్వదినాన వేలాదిమంది భక్తులతో లంకమల కిటకిటలాడుతుంది. శివరాత్రిని పురస్కరించుకుని 26వ తేదీ బుధవారం ఉదయం గుండం దగ్గర గణపతి పూజ, అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ఎదుర్కోళ్ల ఉత్సవం పార్వతి పరమేశ్వర కల్యాణం, గురువారం తెల్లవారుజామున గుండంలో తెప్పోత్సవం నిర్వహిస్తారు. బద్వేలు నుంచి లంకమలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. లంకమలలో ఎలాంటి అవినీతి సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ నాగభూషణం తెలిపారు. గోపవరం మండలంలోని మల్లెంకొండేశ్వర స్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. గోపవరం నుంచి కొండవద్దకు 25 కి.మీ. వాహనంలో.. కొండ కింది నుంచి ఆలయం వద్దకు 7 కి.మీ నడిచి చేరుకోవాల్సి ఉంటుంది.


పులివెందుల మండలంలో గవిమల్లేశ్వరుని క్షేత్రం

గవిమల్లేశ్వరుని ఆలయంలో..

పులివెందుల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గం వేంపల్లె మండలంలో వెలసిన గవిమల్లేశ్వరుడు సాక్షాత్తు పాపాఘ్ని నదీ ఒడ్డున కొండగుహలో కొలువై ఉన్నాడు. శివరాత్రి సందర్భంగా ఇక్కడకు చుట్టుపక్కల ప్రజలు పెద్దఎత్తున తరలివస్తారు. పులివెందుల మండలంలోని నామాలగుండులో వెలసిన సిద్దలింగేశ్వరుడు ఇక్కడ ప్రసిద్ధి. రెండు కొండల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో ఒక కొండ దడికి ఈ ఆలయం వెలసింది. సింహాద్రిపురం మండలంలోని భానుకోటేశ్వర ఆలయం వద్దకు నియోజకవర్గంలోని ప్రజలే కాకుండా జమ్మలమడుగు, తాడిపత్రి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు.



పొలతలలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలు పొలతల క్షేత్రంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దర్శనం చేసుకుని జాగారం చేసేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలు, చలువపందిర్లు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో కృష్ణానాయక్ అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ శివరాత్రి రోజున ఎలాంటి సమస్యలు రాకుండా అన్నీ సిద్ధం చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు కోనేర్లలో స్నానమాచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకోనున్నారు.

నాగనాధేశ్వరకోనలో..


ప్రత్యేక అలంకరణలో నాగనాధేశ్వరుడు

ఖాజీపేట. ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎత్తయిన కొండలపై ఆహ్లాదకర వాతావరణంలో కొలువుదీరిన నాగనాధేశ్వరుడి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. శివరాత్రిని పురస్కరించుకుని నాగనాధేశ్వరుని కోనను విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం రాత్రి శివపార్వతులకు కల్యాణం నిర్వహించనున్నారు. కొండ కింద భాగంలో ఆర్యవైశ్యులు హరికథ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శివరాత్రిని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివునికి అభిషేకాలు నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ ఆదినారాయణరెడ్డి పర్య వేక్షిస్తున్నారు. జాగారం చేసే భక్తులకు అల్పాహారం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.




శైవ క్షేత్రాలకు తరలి వెళుతున్న భక్తులు



సీఎస్ ఆర్ఎంవోపై విచారణ

కలికిరి / కడప సెవెన్‌రోడ్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కడప సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో సీఎస్ ఆర్ఎంవోగా పని చేస్తున్న డాక్టర్ ఎం.పెంచలయ్యపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అభియోగాలకు సంబంధించిన నోటీసులను ప్రభుత్వం జారీ చేసింది. నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా పనిచేసే సమయంలో జరిగిన అవకతవకలకు డాక్టర్ పెంచలయ్యను పూర్తి బాధ్యుడుగా ప్రభుత్వం నిర్ధారించింది. ఆ జిల్లాలో కృష్ణాపురం పీహెచ్‌సీలో వైద్యాధికారిగా పనిచేస్తుండిన డాక్టర్ వంశీకృష్ణ సుమన్ 2022 మే 5వ తేదీ నుంచి 2024 సెప్టెంబరు వరకూ డ్యూటీలో లేకున్నా ప్రతి నెలా జీతాలు చెల్లించారనేది ప్రధాన అభియోగం. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా జిల్లాలో పనిచేస్తున్న ఒక వైద్యాధికారితో సహా 14 మంది ఉద్యోగులను డెప్యుటేషన్‌పై నియమించారని మరో ఆరోపణ. దీని పైన డాక్టర్ కామేశ్వర్ ప్రసాద్‌తో నిర్వహించిన విచారణలో విస్తుగొలిపే విషయాలు వెల్లడయ్యాయి. డాక్టర్ వంశీకృష్ణ తన గైరుహాజరు కాలంలో నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజీలో పీజీ కోర్సు (ఎండీ పీడియాట్రిక్స్)లో చేరారని నిర్ధారణ అయింది. అంతేగాకుండా ఇన్ సర్వీసు కోర్సు కాకుండా మేనేజిమెంట్ కోటా నుంచి సీటు సంపాదించి పీజీ కోర్సు చేసినందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ జీతాలు చెల్లించరాదనే విషయాన్ని పెంచలయ్య ఉద్దేశపూర్వకంగా విస్మరించారని నిర్ధారించారు. ఈ అభియోగాలతో ఆయనకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లోగా తన వివరణను సమర్పించుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజులా డి హోస్‌మణి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రొద్దుటూరులో గంజాయి గ్యాంగులు

- ఆరీఫ్ అనే వ్యక్తిపై మూకుమ్మడి దాడి, కిడ్నాప్
- స్నేహితుడి సహాయంతో బయటపడ్డ ఆరీఫ్
- కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు

7

భవిష్యత్తు మనదే ఎవరూ అధైర్యపడద్దు

- ప్రజాదర్బార్‌లో మాజీ సీఎం జగన్


పులివెందుల ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న జగన్

పులివెందుల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు మనదే, మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందని ఎవరూ అధైర్యపడవద్దని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం పులివెందులకు వచ్చారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో తాడేపల్లె నుంచి పులివెందులలోని బాకరాపురానికి హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. అక్కడి నుంచి వాహనంలో ఇంటికి చేరుకున్నారు. ఒంటిగంట ప్రాంతంలో క్యాంప్ కార్యాలయానికి వచ్చి ప్రజాదర్బార్ ప్రారంభించారు. పులివెందుల నియోజకవర్గంతో పాటు కడప, కమలాపురం తదితర నియోజకవర్గాల నుంచి కూడా ఆయన అభిమానులు, నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు వారివారి వ్యక్తిగత సమస్యలపై జగన్‌ను కలిశారు. పలువురు యువకులు జగన్‌తో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. సాయంత్రం 5.15గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహించారు. అనంతరం ఇటీవల వివాహమైన, గృహప్రవేశాలు జరిగిన వారి ఇళ్లకు వెళ్లి వారిని పలుకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుధ, ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, వైసీపీ ప్రధాన కార్యదర్శి సతీశ్‌రెడ్డి, కడప మేయర్ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా.. బుధవారం రాజారెడ్డి ఆసుపత్రి ఉన్న చోట నిర్మించిన నూతన భవనంలో ఏర్పాటు చేస్తున్న ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రిని జగన్ ప్రారంభించిన అనంతరం బెంగళూరు వెళ్లనున్నారు.

అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు : జేసీ

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో అదనంగా వసూళ్లు చేస్తే ఏజెన్సీలపై చర్యలు తప్పవని జేసీ అదితిసింగ్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకుల సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ గ్యాస్‌బిల్లు ధర కంటే అదనంగా వసూళ్లు చేస్తున్నట్లు ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ సర్వే ద్వారా ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత ఏజెన్సీలకు గ్యాస్ సిలిండర్ అదనపు ధరలు వసూలు చేయకూడదని ఆదేశాలు జారీ చేశామన్నారు. దీనిని అతిక్రమించే ఏజెన్సీలకు పెనాల్టీ వేస్తామన్నారు. జిల్లాలో దీపం సబ్సిడీ పడని వారు సంబంధిత గ్యాస్ ఏజెన్సీల వద్దకెళ్లి గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం, ఈకేవైసీ చేసుకోవాలన్నారు. లీగల్ మెట్రాలజీ అధికారి, జిల్లా పౌరసంబంధాల అధికారి, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్లు, గ్యాస్ ఏజెన్సీల డీలర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ బదిలీ

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కడప కలెక్టరేట్‌లో కేఆర్ఆర్‌సీ ఎస్డీసీగా విధులు నిర్వహిస్తున్న బి.శాంతమ్మను కడపలోని జీఎన్ఎస్ఎస్ యూనిట్-2 భూసేకరణ విభాగానికి బదిలీ చేశారు. అనంతపురం జిల్లాలో పీఏబీఆర్ భూ సేకరణలో పనిచేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె.శిరీషను కడప మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సెక్రటరీగా నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

భయం.. భయం

- పండ్లతోటలను నాశనం చేస్తున్న గజరాజులు
- భయాందోళనలో ప్రజలు

7

రూ.22.62 లక్షల ఆర్థిక అక్రమాలు

- ఇద్దరిపై క్రిమినల్ చర్యలకు కలెక్టర్ ఆదేశాలు

కడప రూరల్,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తొండూరు ఎంపీడీవో కార్యాలయం పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులలో రూ.22.62లక్షల అక్రమాలకు సంబంధించి ఇద్దరిపై క్రిమినల్ చర్యలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అక్రమాలకు పరోక్షంగా బాధ్యులైన ఎంపీడీవో విష్ణుప్రసాద్, అప్పటి జూనియర్ అసిస్టెంట్ (ప్రస్తుతం అగరూరు జడ్పీ హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్) దస్తగిరమ్మలపై కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చర్యలకు ఉపక్రమించారు. అలాగే ప్రత్యక్షంగా బాధ్యులైన మండల్ లెవల్ కో-ఆర్డినేటర్ (ఎంఎల్‌సీవో) చంద్ర ఓబులేసును సర్వీస్ నుంచి తొలగించారు. 2023-24 సంవత్సరంలో మండలానికి మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులలో రూ.22,62,888 లక్షల మేర అక్రమాలకు పాల్పడ్డారు. దీనికి సంబంధించి విచారణ నివేదికను ఈ ఆఫీస్ ద్వారా కలెక్టర్‌కు పంపడంతో మంగళవారం ఆయన ఆమోదించి పై చర్యలు తీసుకున్నారు.

విద్యుత్ కార్యాలయంలో రూ.60 లక్షలు స్వాహా

- 5 మంది సస్పెన్షన్


మాట్లాడుతున్న జిల్లా అకౌంట్స్ అధికారి మల్లికార్జున

జమ్మలమడుగు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు విద్యుత్ కార్యాలయంలో దాదాపు రూ.60 లక్షల మిస్సింగ్ జరిగిందని, సీనియర్ అసిస్టెంట్ సుజిత్ వాడుకున్నారని కడప జిల్లా విద్యుత్ శాఖ అకౌంట్స్ అధికారి మల్లికార్జున వెల్లడించారు. మంగళవారం జమ్మలమడుగులోని విద్యుత్ సబ్ డివిజినల్ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జమ్మలమడుగులో విద్యుత్ బిల్లుల డబ్బులు స్వాహా జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి సుధాకర్ జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారన్నారు. వెంటనే జిల్లా అధికారులు ఈ నెల 11వ తేదీ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారని సుమారు రూ.60లక్షలు అప్పుడప్పుడు వాడుకున్నట్లు తేలిందన్నారు. దీనికి సంబంధించి జమ్మలమడుగులో పనిచేస్తున్న ఏఏవోలు రాధమ్మ, షాహినా బాను, సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ సుజిత్, జేఏవో విజయ బాబులను సస్పెండ్ చేశామన్నారు. ఉన్నత స్థాయి అధికారులు విచారణ జరిపి నిధుల స్వాహాలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. కాగా.. సస్పెన్షన్‌కు గురైన జమ్మలమడుగు అసిస్టెంట్ అధికారి డి.సుధాకర్ విలేకరుల ఎదుట మాట్లాడుతూ.. తాను ఫిబ్రవరి 11 వతేదీ రికార్డులు పరిశీలించి సీనియర్ అసిస్టెంట్ సుజిత్ డబ్బులు స్వాహా చేశాడని జిల్లా అధికారులకు సమాచారం తెలిపానని అన్నారు. వారు 12వ తేదీ జమ్మలమడుగు సందర్శించి సస్పెండ్ తనను కూడా చేశారన్నారు. తాను ఏ తప్పు చేయక పోయినా తనను సస్పెండ్ చేయడం బాధగా ఉందన్నారు.

ఆకేపాటా.. మజాకా..!



ఆకేపాటి అమరనాథరెడ్డికి సంబంధించిన ఆకేపాటి ఎస్టేట్ ముఖద్వారం

- అది అల్లాటప్పా ఎస్టేట్ కాదు..
- వేరే లెవెల్.. సకల సౌకర్యాలు అక్కడే..
- దర్జాగా ప్రభుత్వ భూములు కబ్జా
- ఆపై అక్రమంగా రిజిస్ట్రేషన్లు.. విలాసవంతమైన నిర్మాణాలు
- అక్రమాల నిగ్గు తేల్చేందుకు రంగంలోకి రెవెన్యూ

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తన కుటుంబ సభ్యుల పేరుతో సుమారు 57 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమించారని రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్బ నరసయ్యనాయుడు ముఖ్యమంత్రి కార్యాలయానికి గత ఏడాది అక్టోబరులో ఫిర్యాదు చేశారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదుపై విచారణ చేశారు. ఇందులో అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు అక్రమంగా ప్రభుత్వ భూమి (గయాలు భూమిని) ఆన్‌లైన్ చేయించుకున్నట్లు నిర్ధారించారు. అంతే కాకుండా ఆ భూమిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయించినట్లు.. భర్త భార్యకు.. భార్య భర్తకు.. అన్న తమ్మునికి.. తమ్ముడు అన్నకు.. ఇలా మొత్తం అన్ని ఎకరాలనూ రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం విశేషం. కనీసం డీకేటీ పట్టాలు ఇచ్చిన భూములు కూడా కాని.. ప్రభుత్వ భూములను అధికారులు కళ్లు మూసుకుని రిజిస్ట్రేషన్లు చేసేయడం మరీ దుర్మార్గం.

అడంగల్, వన్‌బీలో నమోదు

ఆకేపాటి అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు రాజంపేట మండలం మందపల్లె, ఆకేపాడు గ్రామాలలో అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మందపల్లె గ్రామంలో బ్లాక్ సర్వే నెంబరు 553లో ఉన్న 1905.60 ఎకరాలను భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ చేసేందుకు ప్రభుత్వం ముక్కలుగా విభజించింది. ఇందులో ప్రభుత్వ లెక్కల ప్రకారం 25.05 ఎకరాలు అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇందులో 563 సర్వే నెంబరు పట్టా భూమి. ఆకేపాడు గ్రామంలో 56 సర్వే నెంబరులో 20.10 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం ముక్కలుగా విభజించింది. ఇందులో 56/1లో 5 ఎకరాలు, 56/8లో 5.68 ఎకరాలు, 56/9లో 2.35 ఎకరాలు కలిపి 13.03 ఎకరాలను అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు ఆన్‌లైన్ చేసుకున్నారు. ఈ భూమిని ప్రభుత్వం ఎవరికీ అసైన్‌మెంటు కింద ఇవ్వలేదు.

కుటుంబ సభ్యుల పేర్లతో ఆన్‌లైన్..

మందపల్లె గ్రామంలో.. ఆకేపాటి జ్యోతమ్మ, భర్త ఆకేపాటి అమరనాథదరెడ్డి పేరు మీద (ఖాతానంబరు 704) 814/3లో 4 ఎకరాలు, ఆకేపాటి సుజన భర్త అనిల్‌కుమార్‌రెడ్డి పేరు మీద (ఖాతానంబరు 277) 814/4లో 5 ఎకరాలు, ఆకేపాటి సుజన భర్త అనిల్‌కుమార్‌రెడ్డి పేరు మీద (ఖాతానంబరు 705)లో 815/1లో 3.79 ఎకరాలు, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తండ్రి ఎ.ఎల్.ఎన్.నారాయణరెడ్డి పేరు మీద (ఖాతానంబరు 707) 815/2లో 5 ఎకరాలు, 816/2లో 4.31 ఎకరాలు.. ఆకేపాడు గ్రామంలో ఆకేపాటి సుజన భర్త అనిల్‌కుమార్ రెడ్డి పేరుమీద (ఖాతా నంబరు 1213) సర్వేనంబరు 56/8లో 5.68 ఎకరాలు, ఆకేపాటి జ్యోతమ్మ భర్త అమరనాథదరెడ్డి పేరు మీద (ఖాతా నెంబరు 1212) 56/9లో 2.35 ఎకరాలు ఆన్‌లైన్ అక్రమంగా చేయించుకున్నారు.

ప్రైవేటు పాఠశాల, స్విమ్మింగ్ పూల్, గుర్రపుశాల



ఇలా అక్రమంగా ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాలలో ఆకేపాటి కుటుంబం ఓ ప్రైవేటు పాఠశాల, స్విమ్మింగ్‌పూల్, గుర్రపుశాలలను నిర్మించుకుంది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారు. ఆ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పుడు పాఠశాల గదులుగా మారిపోయాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆ పాఠశాలకే ఆకేపాటి అమరనాథరెడ్డి పాఠశాలగా నామకరణం చేశారు. తమ సొంత నిధులతో పేదలకు ఉచిత విద్యాబోధన చేస్తున్నట్లు పైకి కనిపిస్తున్నారు. ఇక్కడే వైసీపీ కార్యకర్తల కోసం సమావేశ మందిరం, జడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు క్యాంపు కార్యాలయం ఉన్నట్లు సమాచారం. ఈ విలాసవంతమైన ఎస్టేట్‌లో ఎన్నో రకరకాల జంతువులు, చిలుకలు, పిట్టలు ఇలా ఎన్నెన్నో మూగజీవాలు ఉన్నాయి. ఇక్కడే పశువుల పాక, అన్నింటికి మించి గుర్రపుశాల, అందులో రేసు గుర్రాలు, ఎస్టేట్‌ను కాపలా కాసే రేసు కుక్కలు, ఉద్యానవన పంటలు ఇలా.. ఎన్నెన్నో ప్రత్యేకతలు ఇక్కడ ఉన్నాయి. ఈ ఎస్టేట్ ఆనుకుని ఆలయాల సముదాయం పక్కన పేదల కోసం ఓ కల్యాణమండపాన్ని ఏర్పాటు చేశారు. అయితే అక్కడ కల్యాణమండపానికి ఉన్న రూములు కూడా ఇందిరమ్మ ఇళ్లే అని పలువురు పేర్కొంటున్నారు. ఈ ఎస్టేట్ ప్రధాన ముఖద్వారం వద్ద పదుల కొద్దీ అటు ఇటు వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఇవన్నీ ప్రభుత్వ భూమిలో కట్టడం విశేషం. ఆకేపాటి ఎస్టేట్‌లోని ప్రైవేటు భవనానికి చుట్టుపక్కల ప్రభుత్వ, జడ్పీ నిధులతో భారీఎత్తున సిమెంటు రోడ్లు నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి.



ఇందిరమ్మ ఇళ్లలో ప్రైవేటు పాఠశాల

అక్రమంగా రిజిస్ట్రేషన్లు

సాధారణంగా ప్రభుత్వ, డీకేటీ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కుదరదు. నిషేధిత భూముల జాబితాలో ఉంటాయి. అయితే అమరనాథరెడ్డి కుటుంబసభ్యులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను రాజంపేటలో రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 మే 6 నుంచి 10వ తేదీ లోపు ఈ రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. ఇందులో పైన ఆన్‌లైన్ చేయించుకున్న వాళ్లందరూ.. భార్యలు భర్తల పేరు మీద.. భర్తలు భార్యల పేరు మీద, అన్న తమ్ముడు పేరుమీద.. తమ్ముడు అన్న పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడం.. ఈ అక్రమాలలో హైలైట్.

మందపల్లె గ్రామంలో ఆకేపాటి జ్యోతమ్మ తన భర్త అమరనాథరెడ్డికి సర్వేనంబరు 814/3లోని నాలుగు ఎకరాలను డాక్యుమెంటు నెంబరు ద్వారా 1773/2023 అమ్మేశారు. సర్వే నెంబరు 814/4 ఐదు ఎకరాలను ఆకేపాటి సుజన తన భర్త అనిల్‌కుమార్‌రెడ్డికి డాక్యుమెంటు నెంబరు 1768/2023 ద్వారా అమ్మారు. సర్వే నెంబరు 815/1 3.79 ఎకరాలను ఆకేపాటి సుజన తన భర్త అనిల్‌కుమార్‌రెడ్డికి డాక్యుమెంటు 1767/2023 ద్వారా అమ్మారు. సర్వే నెంబరు 815/2లో ఐదు ఎకరాలు ఆకేపాటి అమరనాథరెడ్డి తన సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డికి డాక్యుమెంటు నెంబరు 1774/2023 ద్వారా అమ్మేశారు. 816/2లో 4.31 ఎకరాలను ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తన భార్య సుజనకు డాక్యుమెంటు నెంబరు 1770/2023 అమ్మారు. ఆకేపాడు గ్రామంలో సర్వే నెంబరు 56/8లో 5.68 ఎకరాలను ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తన భార్య సుజనకు డాక్యుమెంటు నెంబరు 1769/2023 ద్వారా అమ్మారు. 56/9లో 2.35 ఎకరాలను ఆకేపాటి అమరనాథరెడ్డి తన భార్య జ్యోతమ్మకు డాక్యుమెంటు 1772 ద్వారా అమ్మేశారు.

సర్వే నెంబరు 553ను పంచుకున్న ఆకేపాటి కుటుంబం

సర్వే నెంబరు 553లో 1,905.60 ఎకరాల భూమి ఒక బ్లాకుగా ఉంది. పేదలకు భూమి పంచేందుకు ప్రభుత్వం చేపట్టిన సబ్‌డివిజన్ ఆకేపాటి కుటుంబానికి వరంలా మారిందనే చెప్పవచ్చు. ఈ సర్వే నెంబరు ముక్కలుగా విభజించిన తర్వాత.. ఏర్పడిన 810 సర్వే నెంబరులో 8.46 ఎకరాలు ఆకేపాటి చిన్నమ్మ (భర్త రాజగోపాల్‌రెడ్డి), 811లో 7.48 ఎకరాలు ఆకేపాటి కార్తీక్‌రెడ్డి (తండ్రి రంగారెడ్డి), ఆకేపాటి శశాంక్ గోపాల్ రెడ్డి (తండ్రి రంగారెడ్డి) పేరుతో 7.5 ఎకరాలు ఆన్‌లైన్ చేశారు. పై రెండు ప్రభుత్వ భూములు, 812/1లో 5 ఎకరాలు ఆకేపాటి అనసూయమ్మ భర్త లక్ష్మీవెంకట నారాయణరెడ్డి, 812/3లో 2.45 ఎకరాలు ఆకేపాటి అనసూయమ్మ భర్త ఆకేపాటి లక్ష్మీవెంకటనారాయణరెడ్డి, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తండ్రి ఆకేపాటి లక్ష్మీ వెంకట నారాయణరెడ్డి 2.45 ఎకరాలు ఆన్‌లైన్ చేయించుకున్నారు. 814/3లో ఆకేపాటి జ్యోతమ్మ భర్త అమరనాథరెడ్డి నాలుగు ఎకరాలు, 814/4లో ఐదు ఎకరాలు ఆకేపాటి సుజన భర్త అనిల్‌కుమార్‌రెడ్డి, 815/1లో ఆకేపాటి సుజన 3.79 ఎకరాలు, 815/2లో ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి ఐదు ఎకరాలు, 816/2లో ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి 4.31 ఎకరాలు ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇవి జిరాయితీ పట్టా భూములు. సర్వే నెంబరు 847/7లో గయాలు భూమి ఆకేపాటి రేణుక పేరు మీద 1.57 ఎకరాలు ఆన్‌లైన్ చేశారు.

నిగ్గు తేల్చేందుకు రంగంలోకి రెవెన్యూ..

టీడీపీ మండల అధ్యక్షుడి ఫిర్యాదుతో.. ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో.. జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆకేపాటి ఎస్టేట్ వ్యవహారాన్ని నిగ్గు తేల్చేందుకు రంగంలోకి దిగింది. ఇప్పటికే ఇక్కడ జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో సమాచారాన్ని సేకరించి.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వాళ్లకు నోటీసులు పంపించింది. అయితే జిల్లా జాయింట్ కలెక్టర్ ఇచ్చిన నోటీసుల మీద ఆకేపాటి కుటుంబం రాజంపేట సివిల్ జడ్జి కోర్టులో 3/2025, 4/2025, 5/2025 6/2025 నెంబర్లతో సూట్ దాఖలు చేశారు. జాయింట్ కలెక్టర్ ఇచ్చిన నోటీసులపైన తమకు అనుకూలంగా పర్మినెంట్ ఇంజక్షన్ కోసం సూట్ వేసినట్లు సమాచారం.



ఆకేపాటి ఎస్టేట్ ఆనుకుని ఇందిరమ్మ ఇళ్లలో ఉన్న కల్యాణమండపం



- ఆకేపాటి ఎస్టేట్‌లోని గుర్రపుశాల

'తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చూడండి'



సీడబ్ల్యూసీ స్కీంను పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ

సిద్దవటం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృ ష్టిలో పెట్టుకుని పంచాయతీ నిధుల్లో ఎక్కువ శాతం తాగునీటి సరఫరాకు వినియోగించాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ ఆదేశించారు. మండలంలోని మాధవరం గ్రామం లో సీపీడబ్ల్యూ స్కీంను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అం దించేందుకు వాడాలని, ట్యాంకులు శుభ్రంగా ఉంచాలని, పైపుల లీకేజీలు తనిఖీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, శానిటేషన్ పనులు నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మెహతాజ్‌యాస్మిన్, ఆర్‌బ్ల్యూసీ డీఈ కిరణ్‌కుమార్, ఏఈ గులురాజు ప్రసాద్, పంచాయత సెక్రటరి లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

విషపు మొక్కలు తిని 20 మేకలు మృతి



మృతిచెందిన మేకలను పరిశీలిస్తున్న పశు వైద్యుడు

సిద్దవటం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విషపు మొక్కలు తిని 20 మేకలు మృతి చెందాయని పశువైద్యాధికారి శివశంకర్ తెలిపారు. మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ మిట్టపల్లె గ్రామానికి చెందిన ఓబయ్య మంగళవారం తన మేకలను గ్రామ సమీపంలోని పంట పొలాల్లోకి మేతకు తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం ఇంటి దగ్గర మేకలు నీళ్లు తాగిన అనంతరం కొద్ది సేపటికే 20 మేకలు మృతిచెందాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన మేకల విలువ 2 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. మృతి చెందిన మేకలను పశువైద్యాధికారి డాక్టర్ శివ శంకర్ పరిశీలించారు. నమూనాలు సేకరించి కడప వెటర్నరి వైద్యశాల ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విషపు మొక్కలు తినడం తోనే మేకలు మృతిచెందినట్లు ల్యాబ్ పరీక్షలో తేలిందని, రైతుకు జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆయన అన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు..



కుమార్ మృతదేహం

ములకలచెరువు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురకాయలకోట సమీపంలో మంగళవారం ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు...దేవళచెరువు పంచాయతీ మావిళ్ల వారిపల్లెకు చెందిన కుమార్ (58) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. అతిగా మద్యం సేవించేవాడు. ఇతని భార్య ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం తెల్లవారుజామున బురకాయల కోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం సమీపంలోని జాతీయ రహదారి పక్కనే అతని మృతదేహం కనిపించింది. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే, వృద్ధుడి ముఖానికి ఒక వైపు తీవ్ర గాయాలు ఉండడంతో అతని మృతిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

షటిల్ కోర్టు వద్ద గుండెపోటుతో..

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): షటిల్ ఆడిన అనంతరం విశ్రాంతి తీసుకుంటుండగా గుండెపోటు రావడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మదనపల్లె పట్టణం సుభాష్‌రోడ్డుకు చెందిన సుబ్రహ్మణ్యం (53) వేరుశనగ వ్యాపారం చేస్తుంటాడు. మంగళవారం ఉదయం షటిల్ ఆడిన కొద్ది సేపటికి గుండెపోటు రావడంతో కుప్పకూలి పోయాడు, వెంటనే మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 20 ఏళ్లుగా షెటిల్ ఆడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు

కలెక్టరేట్‌కు ఏసీబీ భయం!

- తలుపులు వేసుకుని విధుల నిర్వహణ
- ఇతరులను అనుమతించవద్దని ఆదేశాలు
- అటెండర్ల సాయంతో పర్యవేక్షణ



మూసి ఉన్న అడ్మినిస్ట్రేషన్ విభాగం తలుపులు

రాయచోటి కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చేనేత, జవుళి శాఖ ఏడీ కృష్ణ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో కలెక్టరేట్ ఉలిక్కిపడింది. దీంతో జిల్లా అధికారులు సోమవారం సాయంత్రం 6 గంట ల నుంచి 8 గంటల వరకు కలెక్టరేట్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ఎవరినీ కార్యాలయం లోపలికి రానివ్వరాదంటూ ఆదేశాలిచ్చినట్లు సిబ్బంది చెపుతున్నారు. కాగా, ఎవరో.. ఏదో తప్పు చేసి ఏసీబీ వారికి పట్టుబడితే కలెక్టరేట్ సిబ్బంది ఎందుకు భయపడుతున్నారని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. కలెక్టరేట్‌లోని కొన్ని విభాగాల్లో పైసలు ఇవ్వకుంటే పైలు కదలడం లేదన్న ఆరోపణలు వినిపిస్తుండడం తో అన్నమయ్య కలెక్టరేట్‌పై ఏసీబీ నిఘా ఉంచి నట్లు ప్రచారం సాగిందని గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు చెబు తున్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో కింది స్థాయి సిబ్బందిని పిలిచి హెచ్చరించారు. ప్రస్తుతం తలుపులు వేసుకుని ఉద్యోగులు విధులు నిర్వహించడం చూస్తుంటే చేస్తుంటే.. అధికారులు మళ్లీ పూర్వం లాగే మామూళ్ల కోసం ప్రజలను పీడిస్తున్నారేమో అని ప్రజలు సందేహిస్తున్నారు. ఈ విషయంలో రాజంపేట డివిజన్‌కు సంబంధించిన ల్యాండ్ సెక్షన్, రాయచోటి డివిజన్ బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారుల పేర్లు కలెక్టరేట్‌లో మారు మోగుతున్నాయి. ఇది ఇలా ఉండగా కలెక్టర్ కార్యాలయంలోకి ఎవరికీ అనుమతి లేదని, అటెండర్‌తో సంకేతాలు పంపిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది అవినీతికి పాల్పడకుంటే, తలుపులు ఎందుకు వేసుకుంటున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

గృహాల కోసం 35 వేల దరఖాస్తులు

- హౌసింగ్ పీడీ సాంబశివయ్య



సమీక్ష సమావేశంలో పీడీ సాంబశివయ్య

పీలేరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గృహాల కోసం 34,757 దరఖాస్తులు అందినట్లు హౌసింగ్ పీడీ సాంబశివయ్య తెలిపారు. పీఎంఏవై-ఎన్టీఆర్ 2.0 కాలనీల పురోగతిపై మంగళవారం ఆయన పీలేరులోని హౌసింగ్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 9,727 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 11,243 గృహాల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు లబ్ధిదారులను చైతన్యవంతుల్ని చేస్తున్నామన్నారు. వీరికి గతంలో ఇస్తున్న రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చేనేత కార్మికులకు రూ.50 వేలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం లబ్దిదారులకు వారానికి రెండు సార్లు బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో లబ్దిదారుల ఖాతాల్లో బిల్లులు జమ చేస్తున్నామన్నారు. పీలేరు నియోజకవర్గంలోని లేఔట్లలో మౌలిక వసతుల కల్పనకు రూ.2.84 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. లబ్ధిదారులు ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని తమ ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలన్నారు. అనంతరం ఆయన మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాల పురగోతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పీలేరు డీఈ రమణయ్య, ఏఈ చంద్రశేఖర రెడ్డి, ఎంఐసీలు హరిబాబు, నాదముని నాయక్, సొహైల్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

'మామిడి మొక్కలు తొలగిస్తాం'



ఆక్రమిత ప్రదేశంలో బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

సుండుపల్లె, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గుట్టలు ఆక్రమించి నాటిన మామిడి చెట్లు తొలగిస్తామని వీఆర్‌వో చిట్టిబాబు తెలిపారు. ఈ నెల 19న 'గుట్టను గుల్ల చేశారు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ దైవాదీనం స్పందించారు. ఆర్‌ఐ శ్రీనివాసులునాయక్, సర్వేయర్ సుబ్బరాయుడు కొత్తపల్లి సమీపంలో గుండాలొంక, మొరంగుట్టలను సర్వే చేసి సుమారు ఒక ఎక రా 50 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు గుర్తించి హద్దులు ఏర్పా టు చేసి బోర్డు నాటారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి మామిడి చెట్లు తొలగిస్తామని వీఆర్వో తెలిపారు. గుట్టలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతి లేకుండా అడవిలోకి వెళితే చర్యలు

- జిల్లా అటవీశాఖ అధికారి ఆర్. జగన్నాథ్‌సింగ్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వై.కోట గుండాలకోనలో ఉత్సవాలను రద్దు చేయడంతో పాటు, అక్కడికి వెళ్లేందుకు అనుమతులు నిరాకరిస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి ఆర్. జగన్నాథ్‌సింగ్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనుమతి లేకుండా రిజర్వు ఫారెస్టులోకి వెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణులు నీరు, ఆహారం సరిగా లేక ఆకలితో ఉంటాయని. వాటిని రెచ్చగొడితే ప్రాణాలు పోతాయన్నారు. ప్రజలు అనుమతి లేకుండా అడవి లోకి వెళితే ప్రాణా లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గుండాలకోనకు వెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. రైల్వేకోడూరు ఐఎఫ్ఎస్ అధికారి సుబ్బరాజు, రైల్వేకోడూరు రేంజర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు రద్దు

ఓబులవారిపల్లె : ఏనుగుల దాడి నేపథ్యంలో వైకోట గుండాల కోనలో శివరాత్రి ఉత్సవాలను రద్దు చేసినట్లు తహసీల్దారు శ్రీధర్‌రావు, ఎంపీడీవో మల్‌రెడ్డి, ఎస్ఐ మహేష్ తెలిపారు. వై.కోట రిజర్వు ఫారెస్టులో ఉన్న గుండాల నీలకంఠేశ్వరస్వామి కోనకు భక్తులు వెళ్లడానికి అనుమతి రద్దు చేసినట్లు వివరించారు. దారి తప్పిన ఏనుగుల కారణంగా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

వివాదాస్పదంగా వాలీశ్వరాలయ అర్చకుల నియామకం

రామసముద్రం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలసముద్రం గ్రామ సమీపంలో ఉన్న వాలీశ్వరస్వామి ఆలయ ప్రధాన పూజారి నియామకంపై వివాదం నెలకొంది. ఈ ఆలయంలో బలసముద్రం గ్రామానికి చెందిన లోకనాథం ప్రధాన పూజారిగా పని చేసేవాడు.. గత ఏడాది శివరాత్రి పండుగ సందర్భంగా ఆలయ నిర్వాహకులకు, పూజారి లోకనాథంకు మధ్య అభిప్రాయ బేధాలు ఏర్పడ్డాయి. దేవదాయ శాఖ అనుమతి లేకుండా ఆలయ భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించాడని, ఆలయ భూములను సాగు చేసుకుంటూ కౌలు చెల్లించడం లేదని, శివరాత్రి సందర్భంగా భక్తులు చెల్లించే కానుకలకు జమ ఖర్చులు చూపించడం లేదని సుమారు పద్దెనిమిది కుటుంబాల వారు ఆరోపణలు చేశారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. దీంతో పోలీసులు బలసముద్రం గ్రామస్తులపై కేసు నమోదు చేసి ఆలయానికి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. ఈ వ్యవహారంలో అప్పటి వైసీ పీ ప్రజా ప్రతినిధి తో పూజారి చేతులు కలిపాడనే విమర్శలున్నాయి. ఈ ఏడాది శివరాత్రి ఉత్సవాలకు బలసముద్రం గ్రామస్తులు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆలయ కమిటీ వేశారు. ఈ కమిటీ లోకనాథంతో పాటు మరికొందరిని పూజారులుగా నియమించుకున్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పూజారి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు కమిటీ నిర్ణయాన్ని ఆమోదిస్తూ ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆలయ కమిటీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ లోకనాథం స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్దార్‌కు మెమోరాండం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు, దేవదాయ శాఖ ఈవో రమణ, సీఐ సత్యనారాయణ, స్థానిక ఎస్ఐ, రెవెన్యూ అధికారులు ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

● పండ్లతోటలను నాశనం చేస్తున్న గజరాజులు
● భయాందోళనలో అటవీ శివారు గ్రామాల ప్రజలు

భయం..భయం



ఏనుగుల దాడి సంఘటనతో ముగ్గురు మృతి చెందిన విషయం మంగళవారం కలకలం రేపింది. దీంతో అటవీ శివారు గ్రామాలకు చెందిన ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే..

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అటవీ శివారు గ్రామాలైన ఇందిరానగర్, శివాజీనగర్, కన్నెగుంట గిరిజన కాలనీ, కుక్కలదొడ్డి, వాగేటికోన, దేశెట్టిపల్లె తదితర గ్రామాల ప్రజలు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు నిత్యం వ్యవసాయ రైతు కూలీ పనులకు వెళుతుంటారు. పొలాల్లోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ప్రతి ఏటా ఏనుగుల గుంపు ఉద్యాన పంటలైన మామిడి, అరటి, బొప్పాయి పంటలను నాశనం చేస్తున్నాయి. అడవిలో నీరు, ఆహారం అతి తక్కువగా ఉండడమే ఇందుకు కారణం అని అటవీశాఖాధికారులు చెబుతున్నారు. గతంలో కర్ణాటక రాష్ట్రంలో ఏనుగులు రాకుండా ఉండడానికి సోలార్ ట్రెంచ్‌ని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. అయితే అక్కడ అది ఫలితాలు చూపించకపోవడంతో ఇక్కడ ఏర్పాటు చేయలేకపోయారు. అయితే అటవీశాఖాధికారులు అడవి చుట్టూ గతంలో ట్రెంచ్‌లు తీయగా స్మగ్లర్లు దాటికి కొన్ని దెబ్బతినగా మరికొన్ని వర్షాలకు కుంగిపోయాయి. శెట్టిగుంట, బిల్లుపాటిపల్లె, కొత్తపల్లె, జానకీపురం తదితర ప్రాంతాల్లో పండ్ల తోటలను ప్రతి ఏటా నాశనం చేస్తున్నాయని రైతులు పలుమార్లు అధికారులకు విన్న వించినా ఏనుగుల కట్టడికి ఇంతవరకు పటిష్టమైన చర్యలు తీసుకోలేదు.

గతంలో ఏనుగుల దాడులు...

ఐదేళ్ల క్రితం శెట్టిగుంట పంచాయతీ పరిధిలోని లక్ష్మీగారిపల్లెకు చెందిన ఓ వ్యక్తి మామిడి తోటలో ఉండగా ఏనుగు దాడి చేసి గాయపరిచింది. పీలేరు మండలంలోని కాకులారంపల్లె పంచాయతీలోని బందార్లపల్లెకు చెందిన మోపిరెడ్డి చిన్నరాజారెడ్డి గత ఏడాది అక్టోబరు 15వ తేదీ తన ఆవులను మేతకు తోలుకెళ్లగా ఏనుగులు దాడి చేయడంతో మృతి చెందాడు.

ఇబ్బంది కలిగితే దాడి చేస్తాయి



సహజంగా ఏనుగులు పగటిపూట ప్రయాణం చేస్తాయి. రాత్రివేళలో ఆహారం తీసుకుంటాయి. ఆహారం తీసుకునే సమయంలో వాటికి ఇబ్బంది కల్గిస్తే అవి దాడులు చేస్తాయి. పిల్లలతో కలిసి వెళుతుంటాయి. చప్పుళ్లు చేస్తే అవి అసహనానికి గురై దాడి చేస్తాయి.

- నాగేశ్వర్‌నాయక్, ఎఫ్‌బీవో, వై.కోట



శెట్టిగుంట ప్రాంతంలో దెబ్బతిన్న ట్రెంచ్

ట్రెంచ్‌లు దెబ్బతిన్నాయి



మామిడి తోటల సమీ పంలో గతంలో ఉన్న ట్రెంచ్‌లు దెబ్బతిన్నాయి. దీంతో ఏనుగులు తోటల్లోకి వచ్చేస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారులకు తెలియ చేసినా పట్టించుకోలేదు.

- నాగినేని వెంకటరమణ, శెట్టిగుంట ఆదర్శ రైతు

ఏనుగులను కట్టడి చేయాలి



ఏనుగులు రాకుండా కట్టడి చేయాలి. లేదంటే పెద్ద ప్రమాదం జరిగే అవకాశా లు ఉన్నాయి. అటవీశాఖాధికారులు, ప్రభుత్వం కలసి ఉమ్మడిగా చర్చలు జరిపి తగు నిర్ణయాలు తీసుకోవాలి.

- ఈశ్వరయ్య, వై.కోట సర్పంచ్

జాతీయ హాకీలో మహిళలు సత్తా చాటాలి



జాతీయ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర మహిళా జట్టు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ హాకీ పోటీల్లో మహిళల రాష్ట్ర జట్టు సత్తా చాటాలని నెల్లూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి (డీఎస్‌డీవో) ఆర్‌కే.యతిరాజ్ అన్నారు. నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మహిళల హాకీ రాష్ట్ర జట్టు శిక్షణ ముగింపు మంగళవారం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏసీ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి మహిళల సీనియర్ హాకీ పోటీల్లో పాల్గొని సత్తా చాటిన వివిధ జిల్లాల క్రీడాకారిణిలు జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి తర్ఫీదునిచ్చామన్నారు. శిక్షణ పొందిన క్రీడాకారిణిలు ఉత్తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి, హర్యానాలో మార్చి 1 నుంచి 12 వరకు జరిగే జాతీయ పోటీల్లో సత్తా చాటాలన్నారు. అనంతరం రాష్ట్ర జట్టుకు ఎంపికైన రమ్య(శ్రీకాకుళం), మేరీభవానీ కుసుమ(అనకాపల్లి), లక్ష్మీరేవతి(అనంతపురం), వరాలమ్మ నందిని(కాకినాడ), కళ్యాణి (విశాఖపట్నం), పావని (సత్యసాయి), హారతి నందిని(కడప), దుర్గాభవాని (ఎన్‌టీఆర్), రుక్మిణి(తిరుపతి), ప్రగతిశ్రావణి(నెల్లూరు), ముజియబేగం (ప్రకాశం)లను ప్రత్యేకంగా అభినందించి, క్రీడాదుస్తులను, పరికరాలు పంపిణీ చేశారు. ఉప విద్యాశాఖాధికారి నాయక్, నెల్లూరు ఎంఈవో తిరుపాల్, ఎంసీహెచ్ హెచ్‌ఎం.కృష్ణయ్య, జిల్లా హాకీ సంఘం డైరెక్టర్ థామస్‌పీటర్, కార్యదర్శి జగన్, జట్టు కోచ్ అనిల్‌కుమార్, మేనేజర్‌లు రవికుమార్, రమ్య, జిల్లా హాకీ కోచ్ చందు, పీఈటీలు జీడీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మద్యం దుకాణం యజమాని మృతి



మధుసూదన్ నాయుడు (ఫైల్)

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తికి చెందిన తిప్పలూరు మధుసూదన్ నాయుడు(49) సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ఎర్రగుంట్లలో మధు వైన్స్ నిర్వ హిస్తున్నాడు. రాత్రి పనులు ముగించు కుని ఇంటికి బయలుదేరాడు. పోట్లదు ర్తిలో ఎన్‌టీ ఆర్ కాలనీ వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాల య్యాయి. బంధువులు చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ గురుశేఖర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ నాయకుడు సీఎం సురేష్‌నాయుడుకు మధు సమీప బంధువు కావడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

బైకుల దొంగ అరెస్టు



అరెస్టు చేసిన నిందితుని చూపుతున్న పోలీసులు

కడప క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఓ దొంగను పోలీసులు అరెస్టు చేశా రు. మంగళవారం కడప టూటౌన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుడి వివరాలను సీఐ నాగార్జున వివరించారు. కడప గంజికుంట కాలనీకి చెందిన గౌస్ బాషా నగరంలో తిరుగుతూ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసి.. గౌసనగర్ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ సమీపంలో దాచి పెట్టి విక్రయించేవాడు. ఈ సమాచారం రావడంతో కడప డీఎస్పీ వెంక టేశ్వర్లు ఆదేశాల మేరకు ఎస్‌ఐలు హుసేన్, సిద్దయ్యలతో కలిసి నిందితున్ని అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించి నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



కమలాపురం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తన భర్త గత రెండు రోజుల నుంచి కనిపించడం లేదని స్థానిక పక్కీరు వీధిలో నివాసం ఉంటున్న షేక్ రజియా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసిం ది. తన అబ్దుల్‌జలీల్ సంవత్సరం క్రితం గుండెకు బైపాస్ సర్జరీ జరిగిందని.. ఆ సమయంలో వైద్య ఖర్చులకు కొందరి వద్ద డబ్బులు అప్పు తీసుకున్నాడు. ఆ అప్పులు తీర్చేమార్గం లేక కలత చెంది ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. పోలీసులు తన భర్త ఆచూకీ తెలపాలని కోరారు.

బండలాగుడు పోటీల్లో సత్తా చాటిన కడప జిల్లా ఎడ్లు

● మొదటి మూడు స్థానాలు కైవసం



గండవరంలో జరుగుతున్న ఎడ్ల బండలాగుడు పోటీలు

కొడవలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండవరంలో వెలసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం గంగా పార్వతి సమేత ఉదయకాళేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నెల్లూరు నగర టీడీపీ పరిశీలకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డిలు ప్రారంభించారు. వీటిని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒంగోలు, బాపట్ల, చిత్తూరు, కడప జిల్లాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో గండవరం వీధులు కిక్కిరిశాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 9 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహుమతి రూ.లక్షను కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దొరసాల గురవారెడ్డికి చెందిన ఎడ్లు కైవసం చేసుకోగా రెండు, మూడు స్థానాల్లో కడప జిల్లా మైదుకూరు చెందిన వెంకటేష్, కుర్ర వెంకటేష్, నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో బాపట్ల జిల్లాకు చెందిన సాయిగణేష్, మారుమూల సుబ్బారెడ్డి, బాపట్ల వీరస్వాముల ఎడ్లు దక్కించుకున్నాయి. విజేతలకు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి బహుమతులు అందజేశారు.

బ్రౌన్ గ్రంథాలయ ఉనికి నలుమూలలకు వ్యాప్తి

● వైవీయూ ఉప కులపతి ఆచార్య ఫణితి ప్రకాష్‌బాబు



వైవీయూ ఉప కులపతిని సత్కరిస్తున్న సీపీ బ్రౌన్ సిబ్బంది

కడప కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని పాఠకులకు, సాహితీవేత్తలకు మరింత చేరువ చేసేలా కృషి చేసి.. తద్వారా సంస్థ ఉనికిని నలుమూలలా వ్యాప్తి చేస్తామని యోగివేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఫణితి ప్రకాష్‌బాబు అన్నారు. వైవీయూ ఉప కులపతిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి మంగళవారం ఆయన బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఎవరెవరు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో ఉప కులపతికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రౌన్‌చేసిన సాహిత్య కృషిని కొనియాడారు. పనిచేస్తున్న సిబ్బంది కృషిని అభినందించారు. ప్రధానంగా కేంద్రంలో తాళపత్ర గ్రంథాలను, రాత ప్రతులను భద్రపరచి పరిశోధకులకు అందుబాటులో ఉంచడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో గ్రం థాలయ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ, పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య .జి. పార్వతి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పరిశోధనా కేంద్రం సిబ్బంది ఆయనను సత్కరించారు.

సేంద్రియ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న వెంకటసునీల్

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలని సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ రాష్ట్ర అధికారి ఆర్.వెంకట సునీల్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కమలాపురం వ్యవ సాయ సబ్ డివిజనులోని కమలాపురం, వల్లూరు, ఎర్ర గుంట్ల, వీఎన్ పల్లె తదితర మండలాల్లో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని నాలుగు రైతులు ఇండ్-గాప్ పద్ధతిలో రైతులు సాగు చేసిన పప్పు శనగ పంటలను పరిశీలించామన్నారు. సహాయ వ్యవసా య సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లోకి మారాలని తెలి పారు. కార్యక్రమంలో ఆయా మండలాల వ్యవసాయ అధికారులు సరస్వతి, సాయిజ్యోతి, శ్రీకాంత్‌రెడ్డి, శ్యాంబాబు, వ్యవసాయ విస్తరణాధికారి దస్తగిరి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : జేసీ



కమలాపురం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎన్నో సమస్యలతో ప్రతినిత్యం తహసీల్దారు కార్యాల యం వస్తుంటారని.. త్వరగా పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సదస్సులో ఎన్ని అర్జీలు వచ్చాయి.. ఇప్పటి వరకు ఎన్ని పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రాల్లో అర్జీలు ఇచ్చిన రైతులు తిరిగి జిల్లా కేంద్రానికి వస్తున్నారని.. ఇక్కడ సమస్యల పరిష్కారం అయితే జిల్లా కేంద్రాలకు ఎందుకు వస్తారని ప్రశ్నించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూసమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. ఈప్రాంతంలో జరుగుతున్న రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమం ఆర్డీవో జాన్ ఎర్విన్, తహసీల్దారు శివరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు పర్వీన్‌బేగం, శ్రీకాంత్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ భయం వద్దు...



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు శారదమ్మ

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ భయం వద్దని.. అది మనుషులకు సోకదని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచా లకులు డాక్టర్ శారదమ్మ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవా రం బర్డ్‌ఫ్లూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ గ్రుడ్లు, చికెన్ బాగా ఉడికించి తినవ చ్చని, దీనివల్ల ఎలాంటి జబ్బులు రావన్నారు. ఎలాంటి అపోహలు నమ్మవద్దని తెలిపారు. అనంతరం కోడి గ్రుడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రొద్దుటూరులో గంజాయి గ్యాంగులు

● ఆరీఫ్ అనే వ్యకిపై మూకుమ్మడి దాడి, కిడ్నాప్
● స్నేహితుడి సహాయంతో బయటపడ్డ ఆరీఫ్
● కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో గంజాయి మత్తు మూలమూలలకు పాకుతోంది. గంజాయి గ్యాంగులు సైతం ఏర్పడుతున్నాయి. గతంలో రౌడీ గ్యాంగులు ఉంటే నేడు గంజాయి, డ్రగ్స్ ముఠాలు తయారయ్యాయి. ఇందుకు నిదర్శనంగా అమృతనగర్‌కు చెందిన స్టౌ రిపేర్లు చేసే షేక్ ఆరీఫ్ అనే వ్యక్తిని ఆదివారం చితకబాది చిత్రహింసలు పెట్టారు. అతని వద్దవున్న 4వేలు డబ్బును తీసుకున్నారు. మరో పదివేలు కావాలంటూ కిడ్నాప్ చేశారు. తెలివిగా స్నేహితుడికి లోకేషన్ షేర్ చేయడంతో కిడ్నాపర్ల నుంచి బయటపడిన ఉదంతం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సంఘటనపై ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..

అమృతనగర్‌కు చెందిన షేక్ ఆరీఫ్ నెల క్రితం ఎర్రగుంట్లలో చేరాడు. అక్కడే స్టౌ రిపేరు షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం సెలవు దినం కావ డంతో ప్రొద్దుటూరులో స్నేహితులను కలవడానికి ఉదయం 11 గంటలకు ఆరిఫ్ ప్రొద్దుటూరుకు వచ్చాడు. తన బావమరిది జాకీర్‌తో కలిసి వుండగా హౌసింగ్ బోర్డుకు చెందిన నరేష్ అనే స్నేహితుడు ఫోన్ చేసి మద్యం తాగడానికి పిలిచాడు. దీంతో ఆరిఫ్, జాకీర్‌లు నరేష్‌తో కలిసి ఆటోనగర్ దగ్గర వున్న శ్రీచైతన్య స్కూలు వెనుకవున్న ముళ్లపొదల వద్దకు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లగానే శ్రీనివాసనగర్‌కు చెందిన శ్రీను, సంజీవనగర్‌కు చెందిన రమేష్‌లు ఆరీఫ్‌ను ముళ్ల కర్రలతో చితకబాదారు. ఇటీవల గంజాయి కేసులో చాపాడు పోలీసులకు పట్టించాడనే అనుమానంతో ఆరీఫ్‌ను పథకం ప్రకారం నరేష్‌తో పిలిపించి దాడి చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి ఏడు వరకు చితకబాదారు. అతని వద్దవున్న డబ్బును గుంజుకున్నారు. మరో పదివేలు ఇస్తే వదిలేస్తామని బెదిరించారు. ఆ తరువాత జాకీర్‌ను వదిలేయడంతో అతను ఇంటికి వెళ్లాడు. ఆరిఫ్ స్నేహితుడైన అమృత్‌నగర్‌కు చెందిన చిన్నకు జరిగిన విషయం చెప్పాడు. శ్రీనివాస నగర్‌కు చెందిన శ్రీనుకు చిన్న ఫోన్ చేసి ఆరీఫ్ మీ వద్ద వున్నాడంట కదా మీరు అడిగిన డబ్బు ఇస్తాను వదిలేయమని కోరాడు. శ్రీను ఆరీఫ్‌ను కొట్టి అప్పుడే పంపాము.. మా వద్ద లేడని చిన్నకు చెప్పాడు. దీంతో చిన్న ఆరీఫ్ కోసం ప్రొద్దుటూరు ఎర్రగుంట్ల ప్రాంతంలో రాత్రంతా వెతికాడు. కానీ ఆరిఫ్ ఆచూకీ లభించలేదు.

రాత్రి 2 గంటల సమయంలో చిన్న సెల్‌కు ఆరిఫ్ నుంచి వాయిస్ మెసేజ్ లోకేషన్ వచ్చింది. అందులో నేనే ప్రమాదంలో ఉన్నాను.. నా సెల్‌కు ఫోన్ కానీ మెసెజ్ కానీ చేయకుండా వెంటనే లోకేషన్ వద్దకు వచ్చేయి అని పెట్టాడు. ఆ లోకేషన్ మైదుకూరు మండలం వనిపెంట దగ్గరలోని ఆదిరెడ్డిపల్లె వద్ద వుందని గుర్తించి వెంటనే బైకు తీసుకొని అక్కడికి వెళ్లాడు. ఆదిరెడ్డిపల్లెలో ఒక ఫంక్షన్ సందర్భంగా డీజే పెట్టారు. అక్కడ ఆగి శ్రీను పవన్ అనే వ్యక్తులు మందు తాగి మత్తులో డ్యాన్సులు వేస్తూ వుండగా.. అక్కడే వున్న ఆరీఫ్‌ను గుర్తించి చిన్న అతన్ని బైక్ మీద తీసుకొచ్చాడు. మైదుకూరు పోలీసుస్టేషన్లో అర్ధరాత్రి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు. సోమవారం తెల్లవారు జామును గంజాయి గ్యాంగు చేతిలో గాయపడిన ఆరీఫ్‌ను చిన్న ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాడు. ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషన్లో ఎస్‌ఐ మహ్మద్ రఫీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.





విద్యుత్ వెలుగులతో మెరిసిపోతున్న కడపనగరంలోని మృత్యుంజయకుంట శివాలయం

శివరాత్రికి ఆలయాలు సిద్ధం..!



పులివెందుల మండలం నామాలగుండు క్షేత్రం

కడప కల్చరల్/ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పండుగ రోజున అన్ని శైవ క్షేత్రాలు హరహర మహాదేవ శంభో శంకరా అనే నామస్మరణతో ప్రతిధ్వనిస్తాయి. ఇప్పటికే జిల్లాలోని అన్ని శైవక్షేత్రాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

శివరాత్రికి ముస్తాబయిన జిల్లాలోని వివిధ శైవక్షేత్రాలు మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వున్న వివిధ శైవక్షేత్రాలు ముస్తాబు చేశారు. కొండ కోనల్లో వెలసిన శైవక్షేత్రాలు శివరాత్రి సందర్భంగా బుధవారం భక్తజనంతో కిటకిటలాడనున్నాయి. మంగళవారం రాత్రి నుంచే పలు శైవక్షేత్రాలకు భక్తులు ప్రత్యేక వాహనాలలో బయలుదేరారు. పెండ్లిమర్రి మండలంలో పొలతల మల్లికార్జునస్వామి ఆలయం, సింహాద్రిపురం మండలంలో వెలసిన భానుకోట ఆలయం. వీరపునాయునిపల్లె మం డలం అనిమెల గ్రామంలో వెలసిన సంగమేశ్వరాలయం, సంబేపల్లి మండలంలో గల మోటకట్ల శివాలయం. మైదుకూరు మండలం భైరవకోనలో వెలసిన శివాలయం, చాపాడు మండలం అల్లాడుపల్లెలో వెలసిన ఆలయం. మైదుకూరు మండలంలో వెలసిన అగస్త్యేశ్వరకోన, జమ్మలమడుగు మండలంలోగల కన్యతీర్థం, రాజంపేట మండలంలో వెలసిన హత్యరాల, చిట్వేల్ మండలం నగరిపోడు సమీపంలో వెలసిన గుండాల కోన, సిద్దవటం మండలంలో గల నిత్యపూజకోన తదితర ఆలయాలకు భక్తజనం పోటెత్తనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆయా ఆలయాలలో అన్ని ఏర్పాట్లు పూర్తిగావించారు.

ప్రత్యేక బస్సుల ఏర్పాటు..: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ఇప్పటికే బస్సులు సిద్ధం చేశారు. జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు భక్తులతో బయలు దేరాయి.

పోలీసు యంత్రాంగం కూడా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లాలోని అన్ని స్థాయిల అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పులివెందుల..: శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శివాలయాల్లో ప్రత్యేక పూజలు సాగనున్నాయి. శివరాత్రి పండుగ బుధవారం ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసేందుకు ఆలయ కమిటీలు అర్చకులు సర్వం సిద్ధం చేశారు. పులివెందుల నియోజక వర్గంలో పలు శివాలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలివెళ్లి స్వామివారిని దర్శించు కోనున్నారు. సింహాద్రిపురం మండలంలోని భానుకోటేశ్వర ఆలయం ప్రసిద్ధి చెందింది. కాగా ఇక్కడ ప్రత్యేక పూజలు , అర్థరాత్రి వరకు అన్నదానం కూడా సాగుతుంది. రాత్రి 12 గంటల ప్రాంతంలో శివపార్వతులకు కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. అలాగే లింగాల మండలంలోని పార్నపల్లెలో వెలసిన మల్లేశ్వరస్వామి, వనంబావి సిద్దలింగేశ్వర ఆలయం, బోనాలలోని చినబావి శివాలయం ప్రసిద్ధిచెందినవి. వేంపల్లె మండలం లో వెలసిన గవిమల్లేశ్వర స్వామి, పాతపేటలోని భవాని నీలకంఠేశ్వరస్వామి ఆలయాలు కూడా చూడదగినవే. పులివెందుల మండలంలోని నామాలగుండులో వెలసిన సిద్దలింగేశ్వరుడు ఇక్కడ ప్రసిద్ధి. రెండు కొండల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో ఒక కొండ దడికి ఈ ఆలయం వెలసింది. కొండ మధ్యలో ఉన్న ఆలయం పక్కనే కోనేటిలో ఎప్పటికీ నీరు ఉండడం ఇక్కడ ప్రాముఖ్యత. గుండాలయ్య కోన, పంచలింగాల కోన, గవిమల్లేశ్వర ఆలయాలు ఇక్కడ చెప్పదగిన ఆలయాలు. అలాగే తొండూరు మండలంలోని ఊడవగండ్లసమీపంలో వెలసిన సోమేశ్వరాలయం ఈ ప్రాంతంలో ప్రసిద్ధి చెందింది.

వల్లూరు..: మండల పరిధిలోని ప్రసిద్ధిగాంచిన పుష్పగిరి క్షేత్రంలో కామాక్షి సమేత వైద్యనాథేశ్వరునికి కొండపై ఉన్న రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ సంతాన మల్లేశ్వరుని దేవాలయాల్లో శివరాత్రి సందర్భంగా కార్యక్రమాలను ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కొండపై ఇప్పటికే చలువపందిర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు వచ్చేటప్పుడు తగు జాగ్రత్తలతో రావాలని కార్యనిర్వాహకులు తెలిపారు. అలాగే వల్లూరులోని భవానీ శంకర ఆలయం, గంగాయపల్లెలోని రామలింగేశ్వరా లయంలో శివరాత్రి సందర్భంగా అభిషేకాలు, పూజలతో పాటు శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తారు.

నేడు కాశీ విశాలాక్షిదేవికి సామూహికంగా సారె

చెన్నూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివాలపల్లె కాశీ విశ్వేశ్వరాలయంలో కాశీ విశాలాక్షిదేవికి సామూహికంగా గ్రామ ప్రజల నుంచి సారె తీసుకుని వస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్థులంతా కలిసి ప్రతి ఇంటి నుంచి సారె తీసుకుని వెళ్లాలని నిర్ణయించడంతో అమ్మవారికి పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు, పిండివంటలతో సారె తీసుకుని వస్తున్నారన్నారు. ఉదయం 10గంటలకు ఆలయ ప్రాంగణంలో కాశీవిశ్వేశ్వర విశాలాక్షి ఉత్సవమూర్తుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.









విద్యుత్ వెలుగులో కడప నగరంలోని సోమేశ్వరాలయం, సింహాద్రిపురం మండలంలో భానుకోట శైవక్షేత్రం, పుష్పగిరి కొండపై చలువ పందిర్లు వేస్తున్న దృశ్యం, పులివెందుల మండలంలో పంచలింగాల క్షేత్రం

రాష్ట్రస్థాయి అబాకస్‌లో నాగార్జున పాఠశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి అబాకాస్ పోటీల్లో కడప నగరం నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ కె.శివతులశమ్మ తెలిపారు. విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, హెడ్‌మిస్ సుశీల దేవి పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

కడప మారుతీనగర్ ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఏఎన్ఎం పోస్టుల నియామకపు నోటిఫికేషన్ విడుదలచేసి ఏఎన్ఎం, జీఎన్ఎం చేసిన ఆశా కార్యకర్తలకు ఏఎన్ఎంగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేస్తూ 7న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్‌తో కలిసి ఆమె మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, కోశాధికారి సి. అమ్ములు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డిరవీంద్రనాథరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సంబంధిత అధికారులకు ఫోను చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కౌలు రైతులకు పింఛన్ మంజూరు చేయాలి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు పింఛన్ మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వైపీ సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కడప నగరంలోని పార్టీ ఆఫీసులో ఆయన మాట్లాడారు. సంఘం గౌరవాధ్యక్షులు మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పి.చంద్రశేఖర్‌రెడ్డి, బాలయ్య, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

వెంటనే మందులు తెప్పించండి

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన వీసీ



మందులను పరిశీలిస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వైద్యపరంగా అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలి వెంటనే విశ్వవిద్యాలయ ఆరోగ్య కేంద్రంలో సిద్ధంగా ఉంచాలని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఫణతి ప్రకాశ్‌బాబు ఆదేశించారు. ఈనెల 24వ తేదీన వైవీయూ ఉపకులపతి ప్రకాశ్‌బాబు బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంలో వీసీ ముందున్న సవాళ్లను ప్రచురించింది. ఈ నేపథ్యంలో హెల్త్ క్లినిక్ నిర్మాణం, మందుల లేమి విషయాన్ని తెలియజేసింది. దీనిపై వీసీ స్పందిస్తూ మగళవారం ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం అవసరాలను వైద్య అధికారి నరేష్‌రెడ్డి వీసీ దృష్టికి తెచ్చారు. అనంతరం అర్ధంతరంగా ఆగిపోయిన ఆరోగ్యకేంద్ర నిర్మాణాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

కాలువల్లో పూడిక తొలగింపు



కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హోమియోపతి కళాశాల రోడ్డులో కాల్వ పూడికలను కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు తొలగించారు. ఈనెల 24న ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన ముందుకు కదలని మురుగు అనే కథనంపై కార్పొరేషన్ అధికారులు స్పందించారు. మంగళవారం హోమియోపతి కళాశాల రోడ్డులో ఉన్న కాల్వ పూడికలను తొలగించారు.

సచివాలయాలు తనిఖీ

చెన్నూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు సచివాలయాలను ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది పనితీరు తదితర వాటిని పరిశీలించారు. అలాగే అక్కడి సిబ్బందితో మాట్లాడారు.

ఉప్పరపల్లెలో పీ4 సర్వే..: దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలను గుర్తించి వారికి ఆర్థికసాయం చేసి మెరుగు పరచాలనిచేపట్టిన పీ4 సర్వే పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో సూచించారు.

విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు

కడప కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో రాహుకాల దీపాలు వెలిగించి నవగ్రహ పూజ చేయాలని జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4-30 వరకూ రాహుకాల పూజలు చేసి దీపాలు వెలిగించడం వలన కోరిన కోరికలు త్వరితగతిన నెరవేరగలవని భక్తుల విశ్వాసం. పూజ చేయడం వలన ఎంతో మందికి ఉద్యోగ , వివాహ, సంతాన ప్రాప్తి కలుగుతోంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వుంటుందని ఆలయ అర్చ కులు తెలిపారు. ప్రధానంగా మహాశిరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు ఆలయ వ్యవస్థాపకుడు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకుడు సుధాదుర్గాప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.





రాహుకాలపూజలు చేస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పైప్‌లైన్ ఏర్పాటుకు సహకరించాలి

లింగాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె వద్దనున్న సీబీఆర్ నుంచి పులివెందుల నియోజకవర్గం ప్రజల దాహార్తి తీర్చేందుకు వాటర్ గ్రిడ్ పథకంలో భాగంగా ఏర్పాటుచేస్తున్న పైప్‌లైన్ నిర్మాణానికి రైతులందరూ సహకరించాలని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య అన్నారు. మంగళవారం కర్ణపాపాయపల్లె, లింగాలలో పైప్‌లైన్ నిర్మాణానికి అభ్యంతరం వ్యక్తం చేస్తున్న రైతులతో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తామని ఆర్డీఓ హామీ ఇవ్వడతో వారు సహకరిస్తామని అంగీకరించారు. డివిజనల్ సర్వేయర్ హేమలత, తహసీల్దార్ ఈశ్వరయ్య తదితరులుపాల్గొన్నారు.

ఉపకులపతిని సత్కరించిన ఇంటాక్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా చరిత్రకు దర్పణంగా నిలిచే ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ తీసుకువస్తున్న మ్యాగజైన్‌ను వైవీయూ వీసీ ఆచార్య ఫణతి ప్రకాశ్‌బాబు ఆవిష్కరించారు. కాగా ఇంటాక్ కడప జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, కోకన్వీనర్ ఎ.వెంకటసుబ్బారెడ్డి, లైఫ్ మెంబర్స్ ఎస్ఎండీ బాష, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వర్లు, బాలఎల్లారెడ్డి, రాఘవేంద్రవర్మ, కోటేశ్వరరావు, కె.కృష్ణారెడ్డి, ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ కె.మృత్యుంజయరావు డాక్టర్ రామసుబ్బారెడ్డి, వెంకటేష్ కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల స్వీకరణ

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పులివెందుల రెవెన్యూ డివిజను పరిధిలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ సులువుగా చేసుకోవచ్చని ఆర్డీవో చిన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి మీసేవ కేంద్రాలు, గ్రామ , వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన తెలిపారు.

అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలించిన తహసీల్దారు

వల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దిగువపల్లె గ్రామంలో సోమవారం జరిగిన గడ్డివాముల దగ్ధం ఘటనాస్థలాన్ని మంగళవారం తహసీల్దారు శ్రీవాణి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు తహసీల్దారు దగ్ధమైన స్థలం పరిశీలన అనంతరం రైతులతో మాట్లాడారు. బాధిత రైతుల వివరాలు తీసుకుని న్యాయం జరిగేలా కృషి చేస్తామని అన్నారు. వీరి వెంట ఆర్ఐ సందీప్, రెవెన్యూ ఇన్స్‌పెక్టరు, టీడీపీ మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డితో పాటు బాధితులు 9 మంది రైతులు, వారి కుటుంబ సభ్యులతో పాటు స్థానిక నాయకులు రమణారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వీసీని కలిసిన గోవర్ధన్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి ఆచార్య ఫణతి ప్రకాశ్‌బాబును టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, వైవీయూ పూర్వ పాలక మండలి సభ్యుడు ఎస్.గోవర్ధన్‌రెడ్డి కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు.

ప్రతి రైతూ కేవైసీ చేయించుకోవాలి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పంట వేసిన ప్రతి రైతు చేయించుకోవాలని ఏవో సరస్వతి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పొడదుర్తి, లేతపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో వరిపంటను పరిశీలించారు. కేంద్ర,రాష్ట్ర వివిధ పథకాలు, రాయితీలు పొందాలంటే 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ 3వతేదీ లోగా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు వికాస్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చేందుకు ప్రతి ఒక్కరూ సాయం చేయాలి

కడప కల్చరల్, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు కాసింత ఆకలి బాధలు తీర్చేందుకు ప్రతి ఒక్కరూ సాయపడాలని మైనార్టీ నేత సుభాన్‌బాష కోరారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సీఎస్ఐ స్కూల్ 1978 పూర్వ విద్యార్థుల బ్యాచ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుల్తాన్‌బాబా (మున్నా) విజయ్‌కుమార్, అబ్దుల్‌కరీం, జయకుమార్, శ్రీనివాసులు, రఫీ, జోహర్‌బాషా, అలీ, ఉస్మాన్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కందులకు మద్దతు ధర కల్పించింది

ముద్దనూరు ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం కందులకు మద్దతు ధర కల్పించిందని ఏడీఏ వెంకటసుబ్బయ్య సూచించారు. మండల పరిధి వి.రాఘవాపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ మార్కెఫెడ్ ద్వారా క్వింటా రూ.7550 కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

చాపాడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ మ్యాగీ తెలిపారు.పెద్ద గురువలూరులో పొలంపిలుస్తుందిలో మాట్లాడారు.

కొలతల పరిశీలన

ముద్దనూరు ఫిబ్రవ రి25 (ఆంధ్ర జ్యోతి):ముద్దనూరు టౌన్‌లో రోడ్డు విస్తర్ణలో నిర్వహిస్తున్న కొలతలను హైవే డీఈ చంద్రశేఖర్, ఏఈ విశ్వనాథ్ పరిశీలించారు.ఇందులో చెట్లతొలగింపు, విస్తీర్ణం కొలతలు వేస్తున్నారు.

ఓం నమో శివ రుద్రాయ

- నేడు మహాశివరాత్రి వేడుకలు
- శైవక్షేత్రాలకు చేరుకున్న భక్తులు
- భక్తుల కోసం వసతి సౌకర్యాలు సిద్ధం చేసిన నిర్వాహకులు
- నాగనాథేశ్వరుడు, లంకమల తదితర ప్రముఖ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు


బద్వేలు మండల పరిధిలోని లంకమలలో రామలింగేశ్వర స్వామి దేవాలయం

బద్వేలు/ఖాజీపేట/మైలవరం/ముద్దనూరు/చాపాడు/జమ్మలమడుగు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :మహాశివరాత్రి ఉత్సవాలకు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాలలో భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బద్వేలు నియోజక పరిధిలోని లంకమల, ఖాజీపేటలోని నాగనాథేశ్వరకోన, మైలవరంమండలంలోని అగస్త్రేశ్వర కోన, జమ్మలమడుగులోని కన్యతీర్థాలకు ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. బద్వేలు పట్టణానికి 30 కిలోమీటర్ల దూరంలో లంకలమల అభయారణ్యంలో ప్రకృతిమాత ఒడిలో వెలసిన పుణ్యక్షేత్రం లంకమల శ్రీరాముడు , సీతాదేవి అన్వేషణలో సంచరిస్తూ లంకమలలో ఉన్న శివుని సన్నిధిలో సేద తీర్చుకుని పరమశివుని పూజించడం వలన అక్కడ క్షేత్రం ముక్తి రామలింగేశ్వర క్షేత్రంగా వెలసింది. మహాశివరాత్రి పర్వదినాన వేలాదిమంది భక్తులతో లంకమల కిటకిటలాడుతుంది. బద్వేలు నుంచి లంకమలకు ప్రత్యేక బస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం తెలిపారు. లంకమలలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ నాగభూషణం తెలిపారు. గోపవరం మండలంలోని మల్లేంకొండేశ్వర స్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది.

కార్యక్రమ వివరాలు : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం గుండం దగ్గర ఉదయం 5 గంటలకు గణపతి పూజ, అభిషేకం ప్రత్యేక పూజలుంటాయి. సాయంత్రం 4 గంటలకు పార్వతి పరమేశ్వర కల్యాణం, మరుసటి రోజు తెప్పోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయి.


పోరుమామిళ్ల నుంచి లారీలో తరలివెళుతున్న భక్తులు

ముస్తాబైన నాగనాథేశ్వరుడు

ఖాజీపేట లోని నాగనాథేశ్వరుని కోన ను విద్యుత్ దీపాలతో అలంకరించారు.బుధవారం రాత్రి శివపార్వతులకు కల్యాణం నిర్వహించనున్నారు.కొండ కింద భాగంలో ఆర్యవైశ్యులు హరికథ కార్యక్రం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఆలయ కమిటీ ఛైర్మన్ ఆదినారాయణరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.జాగారం చేసే భక్తులకు అల్పాహారం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఖాజీపేట లోని తీర్థాలకు భక్తులు వెళ్లేందుకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా దారికి ఇరువైపుల కంపచెట్లను తొలగించారు. ఖాజీపేటకు దాదాపు 15 కి.మీ. దూరంలో అడవి ప్రాంతంలో స్వయంభువునిగా శివుడు వెలిశాడు.

అగస్త్యేశ్వరస్వామి కోనలో..

మైలవరం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అగస్త్యేశ్వరస్వామి కోనలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శివపార్వతుల కల్యాణంతో పాటు స్వామి వారి దర్శణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లు చేశారు. అలాగే సమీపంలోని త్రిమూర్తుల కోనలో రాయలసీమ సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు, ట్రాక్టర్ రివర్స్ పందేలు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నుంచి కోనకు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు.

బొందలకుంట బసవేశ్వరాలయంలో..

ముద్దనూరు మండల పరిధి బొందలకుంట బసవేశ్వర ఆలయంలో బుధవారం మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. పార్వతీ సమేత బసవేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం,సాయంత్రం బసవేశ్వరస్వామి రథోత్సవం ఉంటుందన్నారు. రథోత్సవంలో కేరళ వారిచే వాయిద్యము, అఘోర, కాంతార,అమ్మవార్ల వేశాధారణలు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చాపాడు వీరభద్రాలయంలో..

చాపాడు మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి ఆలయంలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు దేవస్థానం ఛైర్మన్ పెరుగు వీరనారాయణ ఈఓ శ్రీనివాసులు పలువురు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. బుధవారం నుంచి రెండు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. భక్తులు వీరభద్రస్వామిని , .భద్రకాళి అమ్మవారని దర్శించుకొనేందుకు బారికేట్లు, చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. .

బాలప్పకోనలో శివపార్వతుల కల్యాణం

కొండాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం బాలప్పకోనలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి శివపార్వతులకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు మిట్టాబాలభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా అన్నదానం, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా


లంకమలలో ఉన్న గుండం

మల్లేశ్వరకోన, గండ్లూరు, చౌటిపల్లె ,ముచ్చుమర్రి, సుగుమంచిపల్లె తదితర శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఎర్రగుంట్లలో: ఎర్రగుంట్ల ఐసీఎల్‌లోని ఉమామహేశ్వ రాలయంలో బుధవారం తెల్లవారు జామునుంచే అభికాషేకాల నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి నుంచి లింగోద్భవ దర్శనం మహాశివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎర్రగుంట్ల ఉమా మహేశ్వరాయంలో ఉమామహేశ్వరుల కలాణోత్సవం నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి లింగోద్భవ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

పోరుమామిళ్లలో: శివరాత్రిపండుగ సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలను ముస్తాబు చేశారు. ముఖ్యంగా పోరుమామిళ్లలోని బాలాత్రిపురసుందరీదేవి, రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. వెంకటాపురంలో ఉన్న గోశృంగ మల్లిఖార్జునస్వామి ఆలయం లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే పొలతల తదితర ప్రాంతాలకు పోరుమామిళ్ల పరిసర ప్రాంతాల నుంచి వ్యాన్లలో, లారీలల్లో అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు.


ముద్దనూరులోని బసవేశ్వర ఆలయం

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషను పరిదిలో ఇద్దరు గంజాయి విక్రయదారులను పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ శివారులోని రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీ దాడి చేసి వారిని పట్టుకున్నారు. వారిలో పట్టణానికి చెందిన కిరణ్‌కుమార్, గురదర్శన్ అనే వ్యక్తులు ఉన్నారని వారివద్ద నుంచి 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపారు.

మొక్కలు ఎండకుండా కాపాడుకోవాలి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో పెట్టుకోని పట్టణంలోని ప్రధాన రహదారులలోని డివైడర్ల మధ్య ఉన్న మొక్కలుఎండకుండా రెగ్యులర్ గా నీళ్లు పట్టి కాపాడాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక గాంధీరోడ్డు లోని డివైడర్ లలో మొక్కలకు నీళ్లు పట్టడాన్ని కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా పాల్గొన్నారు.

సీమకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమకు అన్నిరంగాల్లో 42 శాతం బడ్జెట్‌లో నిధులు కేటా యించాలని రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ మహమూద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సృజనా సామాజిక వేదిక కార్యాలయంలో రాయలసీమకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరతూ రాయలసీమ విద్యావంతుల వేదిక ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కథారచయిత దాదాహయాత్ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి మురళీ జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వాసురేష్, విరసం రాష్ట్ర మాజీ కార్యదర్శి వరలక్ష్మీ చైతన్య మహిళా సంఘం జిల్లాకన్వీనర్ పద్మ, మహిళా శక్తి రాష్ట్ర కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, విద్యార్థి శక్తి కన్వీనర్ హరిత, విద్యావంతుల వేదిక సభ్యులు సుబ్బయ్య దస్తగిరి, పీకేఎస్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేయాలి

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్‌లో కేసులు త్వరితగతిన రాజీ చేయాలని ఇన్సూరెన్సు కంపెనీ లాయర్లను జిల్లా జడ్జి సత్యకుమారి ఆదేశించారు. స్థానిక జిల్లా కోర్టులో న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ కంపెనీ లాయర్లతో జిల్లా జడ్జి సమావేశమై మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి కక్షిదారులతో మాట్లాడి రాజీ చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్సూరెన్సు కంపెనీల లాయర్లు పాల్గొన్నారు.

నారాలోకేశ్‌ను కలిసిన చెరుకూరి రవికుమార్‌నాయుడు



బద్వేలు రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ యువ నాయకుడు చెరు కూరి రవికుమార్‌నాయుడు మంగళవారం మంగళగిరి సచివాలయంలోరాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఆయన ఛాంబరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని కార్యకర్తల పరిస్థితిని నారాలోకేశ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపా రు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్, డిగ్రీ కళాశాల శిథిలావస్థలో ఉన్నాయని, వాటికి త్వరితగతిన నిధులు కేటాయించి కొత్త భవనాలు మంజూరు చేయాలని కోరుతూ నారా లోకేశ్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన నారాలోకేశ్ త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

సీపీఐ భూపోరాటాలకు అండగా ఉంటా..

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌డీ విజయజ్యోతి

గోపవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఆధ్వర్యంలో పీపీ కుంట, సి.కొత్తపల్లెలో జరుగుతున్న భూపోరాటాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి అన్నారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో పీపీకుంట, సి.కొత్తపల్లెలో జరుగుతున్న భూపోరాటాలను ఐదురోజులుగా చేస్తున్న దీక్ష శిబిరాలను ఆమె సందర్శించి సమస్యలను ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీపీ కుంట భూపోరాట కన్వీనరు పీపీ రమణ, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, గోపవరం మండల కార్యదర్శి పెంచలయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు విజయమ్మ, నాయకులు వెంకటయ్య, ఓబులేసు, గురయ్య, రవి పాల్గొన్నారు.

విద్యుత్ కాంతులతో శైవక్షేత్రాలు


విద్యుత్ వెలుగుల్లో ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయం

ప్రొద్దుటూరు టౌన్ ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివునికి ప్రీతికరమైన శివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలోని అగస్త్రేశ్వరస్వామి ఆలయం రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వర స్వామి ఆలయం పెన్నా తీరంలోని అమృతేశ్వర స్వామి ఆలయాలు విద్యుత్ కాంతులతో మెరుస్తున్నాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ నిర్వహణ ఏర్పాట్లు చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి అగస్త్రేశ్వర స్వామి ఆలయంలో సుప్రభాత సేవ మహన్యాన పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం శివపార్వతుల కల్యాణం రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదం ఉంటుందన్నారు.

మైదుకూరు రూరల్‌లో : స్థానిక పాతూరులో లక్ష్మీమాదవరాయస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఛైర్మన్ బెల్లం సుబ్బారాయుడు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా భీమేశ్వరస్వామి, పార్వతిదేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. బుధవారం తెల్లవారు జాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ,సాయంత్రం ఐదు గంటలకు పార్వతి భీమేశ్వరస్వామి కల్యాణం జరుతుందని, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని సుబ్బారాయుడు తెలిపారు. మండలంలోని ముక్కొండ మల్లేశ్వరుడు, భైరవకోనలో మొండి భైరవుడు,గణపతి నగర్‌లోని శివాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయాల నిర్వాహకులు తెలిపారు.

ఆత్మహత్యలపై ఆర్డీవో విచారణ


జిల్లెల్లలో విచారిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

దువ్వూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలో కిందటి ఏడాది ఆత్మ హత్య చేసుకున్న వారి కుటుంబ సభ్యులతో మంగళవారం జమ్మలమడు గు ఆర్డీఓ సాయిశ్రీ విచారణ చేశారు. పెద్దజొన్నవరంలో గత సంవత్సరం ఆగస్టు 21 వతేదీన లంక వీరయ్య, ఇదే నెల 24 వ తేదీన జిల్లెల్ల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పెద్దజొన్నవరంలో బాధిత కుటుంబ సభ్యులతో ఆర్డీవో మాట్లాడారు. అప్పులు ఎక్కువ అయ్యాయని వాటిని తీర్చలేకనే భయపడి ఆత్మహత్యలు చేసుకొన్నట్లు కుటుంబీకులు తెలిపారు. అనంతరం జిల్లెల్ల గ్రామంలో చంద్రశేఖర్ కుటుంబీకులకు కలిశారు. ఆరు ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని పంటలు సాగు చేయగా దిగుబడి చేతికందక, అప్పులు విపరీతంగా పెరగ డంతో బయపడి ఆత్మహత్య చేసుకొన్నట్లు తెలిపారు. ఆర్డీవో వెంట మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి, తహశీల్దార్ ఇక్బాల్‌భాష ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై పరిశీలన

రాజుపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యో తి):గడిచిన ఐదేళ్లకాలంలో కేంద్ర ప్రభు త్వం ద్వారా మంజూరు చేసిన నాలుగు రకాల పథకాల అమలుపై సర్వే బృం దం సభ్యులు ఎంపిక చేసిన గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. రాజుపాలెం మండలంలోని గోపాయపల్లె పుణ్యక్షేత్ర మైన వెల్లాల గ్రామాన్ని మంగళవారం సంబోధిరీసెర్చ్ కమ్యూనికేషన్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే బృందం సభ్యులు పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన, నేషనల్ రూరల్, లైవ్‌ఫుల్ ఫుడ్‌మిషన్, నేషనల్ సోషల్ అసిస్టెన్సీ ప్రోగ్రాం పెన్షన్లపై సర్వే బృందం ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి షాకీర్‌అలీఖాన్, గ్రామ పంచాయతీ సెక్రటరీ దస్తగిరి రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారంపై కంపెనీలు నోరు విప్పాలి

దువ్వూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలో క్రాసింగ్ జొన్న సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించే విషయంలో విత్తనాలు ఇచ్చిన కంపెనీలు నోరు విప్పాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు యంవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు.మండలంలోని పలుగ్రామాల్లో క్రాసింగ్ జొన్న సాగు చేసిన పలు ప్రాంతాలను ఆయన సందర్శించారు. అనంతరం దువ్వూరులో మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.70 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా నాయకులు రామాంజినేయులు,రామూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

పోరుమామిళ్ల,,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సిద్దవరం, బికోడూరు మండలంలోని ఆదిత్యరాంపేట ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 56 మంది విద్యార్థులకు వివేకానంద ఫౌండేసన్ సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని ఉచితంగా అందించారు .ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకులు రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని పేద విద్యార్థులకు విద్యాపరంగా బాసటగా నిలపడమే సంస్థ లక్ష్యమన్నారు. పోరుమామిళ్ల మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో టెన్త్‌లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థికి పదివేలు సంస్థ తరపున బహుమతి అందిస్తామని ఉపాధ్యాయుడు బీరం రాంభూపాల్‌రెడ్డి తెలిపారు.

గురుకుల పాఠశాల విద్యార్థులకు దుస్తులు పంపిణీ

బి.కోడూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సగిలేరు గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 240 మంది విద్యార్థులకు దుస్తులను మంగళవారం చిత్తశౌరిరెడ్డి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చిత్తథామస్‌రెడ్డి, డాక్టర్ గీత దంపతులు ఉచితంగా పంపిణీ చేశారు. వాటిని సంస్థ ప్రతినిధి ప్రతాప్‌రెడ్డి అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను రద్దుచేస్తే కమిషనర్లకే అథారిటీ ఇవ్వాలి

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆప్కాస్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తే మున్సిపల్ కమిషనర్లకే ప్రిన్సిపల్ అథారిటీ ఇవ్వాలని సీపీఐ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లాకార్యవర్గ సభ్యుడు రామయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు విజయ నిర్మల, ప్రమీళరాణి, గురుమూర్తి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల గురించి అవగాహన

మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమ బద్ధీకరణ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ మధుసూధన్ రావు మాట్లాడుతూ మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలోని పేద, మధ్య తరగతి ప్రజలు పెద్ద వ్యాపారాలకు తీసిపోకుండా జీవనం సాగించేం దుకు పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద రుణాలు వస్తాయని వాటికి సబ్సిడీ ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం జయరాజు, సీసీలు పాల్గొన్నారు.